క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): టీటీడీ న్యూఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని నగరంలోని ఆమె నివాసంలో మేయర్ పొట్లూరి స్రవంతి, జయవర్ధన్ దంపతులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు.

సీఎంఏ ఫలితాల్లో 'మాస్టర్ మైండ్స్' హవా

నెల్లూరు (టౌన్): సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని బ్రాంచ్ అడ్మిన్ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా స్థాయిలో శ్రీజ 26, భావన 36, అలేఖ్య 44వ ర్యాంక్‌ను సాధించారని చెప్పారు.

8న ఓపెన్ చెస్ టోర్నీ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ద్వారకానాథ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): స్టోన్‌హౌస్‌పేటలోని మై డ్రీమ్స్ క్లబ్ స్టేడియంలో ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీని అక్టోబర్ 8న డాట్స్ లింక్స్, ఆర్ఎల్, ఎస్వీ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని ఆంధ్ర ప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని నుడా చైర్మన్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.52 వేల నగదు బహుమతులతో పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, రామ్‌లక్ష్మణ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమీపై పీడీ యాక్ట్

• కడప కేంద్ర కారాగారానికి తరలింపు



నెల్లూరు(క్రైమ్): ఇండియన్ నేషనల్ లీగ్ నేత, రౌడీషీటర్ సయ్యద్ సమీ హుస్సేనీపై పీడీ యాక్ట్ నమోదైంది. జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు అనంతరం ఆయన్ను కడప కేంద్ర కారాగారానికి పోలీస్ అధికారులు శనివారం తరలించారు. వివరాలు.. కోటమిట్టకు చెందిన సయ్యద్ సమీ హుస్సేనీ మొదట్నుంచి వివాదాస్పదుడు. టీడీపీ నేతల అండదండలతో కొంత కాలంగా నేరాలకు పాల్పడుతున్నారు. బారాషహీద్ దర్గా ఆవరణలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత సమీర్‌ఖాన్‌పై ఈ ఏడాది ఫిబ్రవరిలో హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు అప్పట్లో సమీపై హత్యాయత్నం కేసును నమోదు చేయడంతో పాటు మరోసారి రౌడీషీట్ తెరిచారు. సదరు కేసులో బెయిల్‌పై వచ్చిన సమీ అంబేడ్కర్‌నగర్ వద్ద వారధి సెంటర్‌కు చెందిన నదీముద్దీన్‌పై ఆగస్టులో హత్యాయత్నం చేశారు. ఈ కేసులోనూ ఆయన్ను దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇటీవల బెయిల్‌పై బయటకొచ్చారు. సమీపై ఇప్పటికే రెండు హత్యాయత్నం కేసులతో పాటు పోలీసులపై దౌర్జన్యం, మరో రెండు కేసులు ఉన్నాయి. దీంతో ఆయనపై పీడీ యాక్ట్ నమోదుకు కలెక్టర్‌కు జిల్లా పోలీస్ శాఖ నివేదికను అందజేశారు. ఆయన ఆమోద ముద్ర వేయడంతో సమీని దర్గామిట్ట పోలీసులు అదుపులోకి తీసుకొని జీజీహెచ్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ప్రత్యేక వాహనంలో కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

కామాక్షితాయి సేవలో న్యాయమూర్తులు



కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నినాల జయసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి కుటుంబంతో కలిసి మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో స్వామి, అమ్మవార్లను శనివారం ఉదయం దర్శించుకున్నారు. తొలుత దేవస్థానం చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ న్యాయమూర్తులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీగణపతిస్వామి, మల్లికార్జునస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షి తాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వారిని శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, ప్రొటోకాల్ న్యాయమూర్తి కేపీ సాయిరాం ఉన్నారు.

వైఎస్సార్సీపీని మరింత బలోపేతం చేయాలి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జీలు, జేసీఎస్ కన్వీనర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి వారికి చేకూరిన లబ్ధిని తెలియజేయాలని సూచించారు. చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వంశీ, సాయిరెడ్డి, రామిరెడ్డి, పుల్లారెడ్డి, కమల్, మేఘనాథ్‌సింగ్, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, పార్టీ రూరల్ అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని అణిచేస్తాం

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రౌడీయిజాన్ని పూర్తిగా అణిచేస్తామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 21వ డివిజన్ పరిధిలోని మాగుంట లేఅవుట్లో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఉండే నియోజకవర్గంలో కొందరు రౌడీయిజం చేస్తూ కల్లోలం సృష్టిస్తున్నారని, ఇక నుంచి వీరి ఆటలను సాగనీయబోమని స్పష్టం చేశారు. నగరంలో మాగుంట లేఅవుట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి రూ.1.5 కోట్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మేయర్ స్రవంతి, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, నేతలు హరిబాబుయాదవ్, కమలాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాలకీర్తి రవి, మద్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 32వ డివిజన్లోని వెంగళరావునగర్‌లో గల పలు ప్రాంతాల్లో రూ.75 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలోని పార్కుల అభివృద్ధి, తదితరాలకు రూ.50 లక్షలను మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్లో రూ.5.5 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. వెంగళరావునగర్ ప్రాంత అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ అవినాష్, పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గౌరి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మద్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నేతలు హరిబాబుయాదవ్, మొబీనా, నరసింహులుగౌడ్, ఆసిఫ్, మేఘనాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల బండి వితరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): హృద్రోగ సమస్యతో ఆపరేషన్ చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పొదలకూరు రోడ్డుకు చెందిన అంకయ్యకు కూరగాయల బండిని శనివారం అందజేశారు.

అమెరికాకు చెందిన మా సేవా సంస్థ సహకారంతో ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ చేతుల మీదుగా ఇచ్చారు. కార్యక్రమంలో రాము, కృష్ణ, సమీవుల్లా, హుమయూన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆటోనగర్‌లోని ఏపీఆర్ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్ – 14, 17 హ్యాండ్‌బాల్ పోటీలు, అండర్ – 17 క్యారమ్స్, అండర్ – 17 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని ప్రిన్సిపల్ మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు అభినందించారు.

ఆవాజ్ నేతల స్కూటర్ ర్యాలీ



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్కచెరువుపాడులో మైనార్టీ గురుకుల పాఠశాలను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, రషీద్ పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని గురుకుల పాఠశాల నుంచి అక్కచెరువుపాడులో నిర్మిస్తున్న పాఠశాల వరకు స్కూటర్ ర్యాలీని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రూ.15 కోట్లతో చేపట్టిన పనుల్లో 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. నేతలు జియా ఉల్ హక్, నజీర్‌బాషా, రవూఫ్, ఫయాజ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష అమలు



హెల్త్ సెక్రటరీలకు సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు (బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో పక్కాగా నిర్వహించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కిసాన్‌నగర్ రైతుబజార్ రోడ్డు, వేదాయపాళెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సమర్థంగా నిర్వహించాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్ఓ వెంకటరమణ, జిజియాబాయి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించనున్న శ్రమదానంలో ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. గణేశ్ ఘాట్, ఇరుకళల పరమేశ్వరి ఆలయం, నెల్లూరు బ్యారేజీ సమీపంలోని తిక్కన పార్కు తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటలకు శ్రమదానాన్ని నిర్వహించనున్నామని వివరించారు.
- నగరంలోని పాఠశాలలు, ఆధ్యాత్మిక ప్రదేశాలు, ప్రభుత్వ భవనాలు తదితర ప్రాంతాల్లో సూచికలు, వేగ నిరోధకాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. బీవీనగర్, కేఎన్నార్ పాఠశాల, రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్పీడ్ బ్రేకర్లు, సూచికల ఏర్పాటు ఆవశ్యకతను పరిశీలించారు.
- ఎఫ్‌సీఐ కాలనీ, బీవీనగర్‌లోని సచివాలయాలను కమిషనర్ సందర్శించారు. అదనపు కమిషనర్ శర్మద, ఇంజినీరింగ్ ఎస్ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో చెలరేగిన మంటలు



ఇంట్లో నుంచి వస్తున్న దట్టమైన పొగలు



అగ్నికి ఆహుతైన వస్తువులు

• రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం

నెల్లూరు(క్రైమ్): ఏసీలో షార్ట్ సర్క్యూటై ఇంట్లో మంటలు చెలరేగి రూ.ఆరు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన బీవీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బీవీనగర్‌కు చెందిన స్టీల్, సిమెంట్ వ్యాపారి గోవర్ధన్‌కు మూడంతస్తుల భవనం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌ను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు, ఫస్ట్ ఫ్లోర్‌ను ప్రాబోస్ ఇన్సురెన్స్ కంపెనీకి అద్దెకు ఇవ్వగా, రెండు.. మూడో ఫ్లోర్లలో డూప్లెక్స్ హౌస్‌లో ఆయన తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బెడ్‌రూమ్‌లోని ఏసీలో విద్యుత్‌వైర్లు షార్ట్‌సర్క్యూటై మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లోని వారు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. అప్పటికే దట్టమైన పొగ కమ్ముకోవడంతో రోప్ సాయంతో బిల్డింగ్ పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి మంటలను అదుపుచేశారు. మూడు ఫైరింజన్లు గంట పాటు శ్రమించాయి. మంటలను సకాలంలో ఆర్పడంతో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లోని కార్యాలయాలకు వ్యాపించలేదు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో రూ.ఆరు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

వెల్లంటిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నెల్లూరు రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. వెల్లంటిలోని జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా నెల్లూరు జట్టు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఇంటర్ జోనల్ అండర్ – 23 పురుషుల విభాగంలో నెల్లూరు జట్టు విజేతగా నిలిచిందని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నిఖిలేశ్వర్ రెడ్డి తెలిపారు. అంతర్ జిల్లా ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలను కడపలో ఈ నెల 24 నుంచి నిర్వహించారని చెప్పారు. సౌత్, సెంట్రల్, నార్త్ జోన్లు, కృష్ణా, విజయనగరం, నెల్లూరు జట్లు పాల్గొనగా, జిల్లా జట్టు విజేతగా నిలిచిందని వివరించారు.

డాక్టరేట్ ప్రదానం



గాయత్రి

నెల్లూరు (టౌన్): వీఎస్‌యూలో బయో టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన గాయత్రికి డాక్టరేట్ లభించింది. వీఎస్‌యూ బయోటెక్నాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కాగా గాయత్రిని పలువురు అభినందించారు.

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన ఆర్డీఓ



నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఏబీవీపీ నేతల ధర్నా



నెల్లూరు (టౌన్): డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు సంబంధించిన సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేయకుండానే ఇన్‌స్టంట్ పరీక్షలను నిర్వహించడం సరికాదని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు వీఆర్సీ సెంటర్‌లో ధర్నాను శనివారం నిర్వహించారు. నేతలు రాహుల్, నరసింహ, రాబర్ట్, వినోద్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు స్వాగతం



నెల్లూరు(దర్గామిట్ట): తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్తూ నగరానికి శనివారం వచ్చిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

న్యాయమూర్తులను కలిసిన ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేశారు.

4న సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (టౌన్): వర్మికంపోస్ట్ తయారీ, నిర్వహణ అనే అంశమై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సును వృక్ష శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగున ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్మికంపోస్ట్‌ను తయారు చేయడంలో నైపుణ్యం, మార్కెటింగ్ చేయడంలో శిక్షణను ఇవ్వనున్నామని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌ను అందజేయనున్నామని పేర్కొన్నారు. పది, ఇంటర్ చదివిన వారు, ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 93924 87705, 93989 00217 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రికెట్ పోటీలకు ఎంపీకి ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల ఏడు నుంచి నిర్వహించనున్న టీ – 20 క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నిర్వాహకులు శనివారం ఆహ్వానించారు. లీగ్ కో ఆర్డినేటర్ ప్రజ్యున్, నిర్వాహకులు ప్రసాద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.